


సంపాదకీయం

# బడ్జెట్ అంటేనే..

## పన్నులు, రాయితీలు.. కోతలు!

బడ్జెట్ అంటేనే..పన్నులు, రాయితీలు..కోతలు..కేటాయింపులు అన్న సంగతి తెలిసిందే. అయితే ఎన్ని బడ్జెట్లు వచ్చినా సగటు భారతీయుడి బతుకుమారడం లేదు. ఉద్యం రాక కొందరు, చేసిన అప్పులు తీర్చ లేక కొందరు..పంటలకు గిట్టుబాటు లేక కొందరు రైతులు..పంటల కోసం చేసిన అప్పులు తీర్చలేక మరికొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దేశంలో మౌళికంగా మార్పులు తీసుకుని వచ్చేలా బడ్జెట ప్రభావం చేయలేకపోతోంది. అనేక విధాలుగా చేసే అవకావం ఉన్నా ప్రభుత్వాలు అచేతనంగా ఉ ంటున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోని బడ్జెట్లు ఎన్ని ప్రవేశ పెట్టినా భారత్ ఆర్థిక ప్రగతి గొర్రతోక బెత్తెడే అన్న చందంగా ఉండిపోతోంది. యన ఆరథిక వ్యవస్థలను అర్థం చేసుకోలేక పోతున్నారు. వచ్చే సంపదను వృధా చేస్తున్నారు. ప్రధానంగా రాజకీయంగా వారి దుబారా ఖర్చులకు ఎక్కువ మొత్తం వృదా అవుతోంది. రాజకీయ నేతల జీతాలు, పెన్షన్ల, విమాన ప్రయాణాలు, అద్దెలు, అలవెన్సులు ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాండంత జాబితా తయారవుతుంది. వీటిలో కోతపెట్టే పని ఏ బడ్జెట్ చేయలేక పోయింది. మోడీ గత 12 ఏళ్లుగా కూడా ఈ పనిచేయలేదు. ఇకముందు చేస్తారన్న గ్యారెంటీ లేదు. రాజకీయ నాయకుల విలాసాలకు ప్రజల డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ప్రజలేమో అధికర ధరలు, పన్నులు, అప్పులతో తిప్పలు పడుతున్నారు. ఇక బడ్జెట్ విషయానికి వస్తే...గతంలో.. సంప్రదాయకంగా ఫిబ్రవరి చివరి రోజున సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ను ప్రవేశపెట్టేవారు. ఇంగ్లాండ్, భారత్ లలో ఒకేసారి ప్రకటనలు చేయగలిగే వలసరాజ్యాల యుగం నాటి సంప్రదాయంగా ఈ సమయం ఉ ంది. అయితే భారతదేశం లండన్ సమయం కంటే 4 గంటల 30 నిమిషాలు ముందుంది. కాబట్టి ఇండియాలో సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ను సమర్పించడం వల్ల యూకేలో మరుసటి రోజు ఉదయం పూట జరుగుతుంది. అయితే 1999లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా ఉ దయం 11 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టి.. తొలిసారి సమయాన్ని మార్చారు. అప్పటి నుంచి బడ్జెట్‌లను ఉదయం 11 గంటలకు ప్రవేశపెడుతున్నారు. ఒకప్పుడు బడ్జెట్‌ను ఫిబ్రవరి నెల చివరి రోజున ప్రవేశపెట్టేవారు. ఇది బ్రిటీష్ కాలం నుంచి వస్తున్న ఆచారం. అయితే 2017లో మోదీ ప్రభుత్వం ఈ పాత సంప్రదాయాన్ని మార్చేసింది. నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. మన దేశంలో కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న మొదలవుతుంది. ఫిబ్రవరి చివరలోబడ్జెట్ ప్రవేశపెడితే, దానిపై చర్చలు ముగిసిన.. నిధులు విడుదలయ్యే సరికి మే లేదా జూన్ నెల వచ్చేది. దీనివల్ల కొత్త పథకాలు ప్రారంభం కావడానికి ఆలస్యమయ్యేది. అందువల్ల ఫిబ్రవరి 1నే బడ్జెట్ ప్రవేశపెడితే.. ఏప్రిల్ 1 నాటికి అన్ని పక్రియలు పూర్తవుతాయి. 2017 నుంచి ఈ కారణంతోనే ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు. ఇకపోతే దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆదివారం నాడు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. ఫిబ్రవరి 1 ఆదివారం అయినా సంప్రదాయం మేరకు బడ్జెట్ ప్రతిపాదనలకు పార్లమెంట్ సిద్ధంగా ఉంది. వరుసగా 9వసారి ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్ ను ప్రవేశపెడతారు. ఆదాయపు పన్ను స్లాబ్‌లలో ఏవైనా మార్పులు ఉ ంటాయా? అని మధ్యతరగతి ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని పెంచుతారని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రకటనలు మీ భవిష్యత్తు పొదుపు, పన్ను బాధ్యతలపై నేరుగా ప్రభావం చూపుతాయి. గ్యాస్ సిలిండర్ ధరల సవరణ ప్రతి నెల ఒకటో తేదీన ఆయిల్ కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సమీక్షిస్తాయి. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరల్లో వస్తున్న మార్పుల వల్ల ఫిబ్రవరి 1 ఉదయం 6 గంటలకే కొత్త ధరలు వెల్లడికానున్నాయి. కమర్షియల్ సిలిండర్లతో పాటు డొమెస్టిక్ గ్యాస్ ధరలు తగ్గుతాయా లేదా పెరుగుతాయా అనేది నేడు తేలిపోతుంది.బ్యాంకింగ్, సేవింగ్స్ ఖాతాల్లో మార్పులు ఫిబ్రవరి 1 నుంచి ఐసీఐసీఐ , హెచ్‌డిఎఫ్‌సి వంటి ప్రధాన బ్యాంకులు తమ సేవా రుసుములను మార-్చుతున్నాయి. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్లు, రెంట్ పేమెంట్స్‌పై అదనపు ఛార్జీలు , మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెనెన్స్ నియమాలు మారబోతున్నాయి. కొన్ని బ్యాంకులు తమ ఫిక్సడ్ డిపాజిట్ వడ్డీ రేట్లను కూడా సవరించే అవకాశం ఉంది. ఇవన్నీ ఇలావుంటే దేశ ద్రవ్యలోటు 2025 డిసెంబరు చివరకు రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, జీడీపీలో 4.4శాతం లేదా రూ.15.69 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. ఈ అంచనాల్లో తాజా గణాంకాలు 54.5 శాతానికి సమానం. 2024-25 ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యంలో 56.7 శాతంగా ఉంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ గణాంకాల ప్రకారం.. డిసెంబరు చివరకు ప్రభుత్వానికి రూ.25.25 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఈ మొత్తం 72.2 శాతానికి సమానం. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపేణ, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర ఆదాయంగా లభించింది. రుణ రహిత పెట్టుబడి సాధనాల్లో రూ.46,047 కోట్లు సమకూరాయి. ఏప్రిల్- డిసెంబరు నెలల్లో పన్ను ఆదాయంలో వాటా రూపేణ రాష్ట్రాలకు రూ.10.38 లక్షల కోట్లు బదిలీ చేశారు. 2024-25 ఇదే కాలంలో బదిలీ చేసిన మొత్తం కంటే ఇది రూ.1.37 లక్షల కోట్లు అధికం. ఏప్రిల్-డిసెంబరులో మొత్తం ప్రభుత్వ వ్యయాలు రూ.33.8 లక్షల కోట్లకు చేరాయి. బ్జడెట్ అంచనాల్లో ఇవి 66.7 శాతానికి సమానం. ఇందులో రూ.25.93 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా.. రూ.7.87 లక్షల కోట్లు పెట్టుబడి వ్యయాలు. రెవెన్యూ వ్యయాల్లో రూ.9.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ.3.17 లక్షల కోట్లు ప్రధాన రాయితీలకు వెచ్చించారు. ఇంతగా లోటు ఉన్నప్పటికీ ఆదాయం బాగానే ఉ ంటోంది. అంటే వృధా ఖర్చుల కారణంగా ద్రవ్యలోటు పెరుగుతోంది. దీనికి నిర్మలమ్మ సమాధానం బడ్జెట్‌లో లభిస్తుందా లేదా అన్నది చూడాలి. వృధాఖర్చుల, అనవసర పథకాలు వంటివన్నీ పక్కన పెడితే తప్ప దేశం గట్టెక్కదు.

# నేడు పార్లమెంట్ ముందుకు బడ్జెట్

- 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం
- ప్రవేశ పెట్టనున్న నిర్మలాసీతారామన్
- ఆదాయపు పన్ను మినహాయింపులపైనే అందరి చూపు



**న్యూఢిల్లీ, జనవరి 31 :** కేంద్రమంత్రి నిర్మలా సీతరామన్ ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ వార్షిక బడ్జెట్ ఎప్పటిలాగే కొన్ని మెరుపులు, మరికొన్ని విరుపులు ఉండేలా ఉంటుందన్న చర్చ సాగుతోంది. పెద్దగా ప్రభావితం కాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడుతుంది. అయితే ఆదివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర ఆర్థిక బ్జడెట్ 2026 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు తమకు ఊరట లభించేలా బ్జడెట్ ఉంటుందనే ఆశతో ఉన్నారు. వారి ఆశలు నిజం చేసే దిశగానే కేంద్రం బ్జడెట్ ఉండనుందని సమాచారం. పన్నుల విషయంలో కీలక మార్పులు జరగవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ 2026లో ఆదాయపు పన్ను నిబంధనలో పలు మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, సీనియర్ సిటిజన్లకు లాభం చేకూరేలా ఈ మార్పులను కేంద్రం తీసుకువస్తుందని సమాచారం. పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, పన్ను విషయంలో భారాన్ని తగ్గించడం, పారదర్శకత, డిజిటల్ పన్ను వ్యవస్థను ఎంచుకోవడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడమే లక్ష్యంగా బడ్జెట్ ఉండనుందన్న వార్తలు వస్తున్నాయి. పాత ఆదాయపు పన్ను చట్టం 1961 నుంచి.. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 వరకు సరళమైన పరివర్తనలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సత్వర పన్ను వాపసులు, సరళీకృత సమ్మతి కీలక లక్ష్యాలుగా ఉండనున్నాయని సమాచారం. వార్షిక సమాచార ప్రకటన, పన్ను చెల్లింపుదారుల సమాచార సారాంశం వంటి వ్యవస్థలు పన్ను దాఖలును సులభతరం చేశాయి. డిజిటల్ వ్యవస్థను మరింత నమ్మదగినదిగా, పారదర్శకంగా మార్చడంపై బడ్జెట్ 2026 దృష్టి సారించే అవకాశముంది. ఏఐని సరిగ్గా ఉపయోగించినట్లయితే పన్ను రిటర్న్‌లను ఆటోమేటిక్‌గా దాఖలు చేయొచ్చని, లోపాలను తగ్గించవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పన్ను వాపసుల కోసం రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థ కూడా సాయపడనుంది. ఆదాయపు పన్ను కేసుల వేగవంతమైన పరిష్కారంపై ప్రాధాన్యం, క్రిప్టో, డిజిటల్ ఆస్తులపై స్పష్టమైన నియమాలకు ఉ పయోగ పడుతుంది. మరోవైపు.. కొత్త పన్ను విధానం వచ్చినప్పటికీ కొన్ని అంశాల్లో పాత పన్ను విధానం అందుబాటులో ఉంటుందని సమాచారం. ముఖ్యంగా గృహ రుణాలు, బీమా ప్రీమియంలు, పదవీ విరమణ పొదుపులు, ఇతర పెట్టుబడులకు సంబంధించిన పన్ను తగ్గింపులకు సంబంధించి పాత విధానాలే ఉంటాయని తెలుస్తోంది. బాగా పన్ను రాయితీ కలిగిన వారు పాత పన్ను విధానం నుంచి ప్రయోజనం పొందడం కొనసాగించవచ్చు. అయితే తక్కువ పన్ను మినహాయింపులు ఉన్న వ్యక్తులు కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సరైన విధానాన్ని ఎంచుకోవడం ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక ముఖ్యమైన నిర్ణయం అవుతుంది. విద్యా, గృహ ఖర్చులు, రోజువారీ జీవన వ్యయాలను నిర్వహించే కుటుంబాలకు ఈ మార్పులు ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాన్ని అందించవచ్చు. 2026లో ఆదాయపు పన్ను నియమాల మార్పు నుంచి సీనియర్ సిటిజన్లు కూడా ప్రయోజనం పొందవచ్చు. ముఖ్యంగా పెన్షన్ ఆదాయం, వాటి వడ్డీ ఆదాయాలపై సరళీకృత పన్ను విధించడం ద్వారా పన్ను దాఖలును సులభతరం చేస్తాయి. ఏది ఏమైనప్పటికీ.. ట్యాక్స్ ప్లేయర్లకు కేంద్రం శుభవార్త చెప్పనుందని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. గత సంవత్సరం ప్రవేశ పెట్టిన పన్ను విధానం పెద్దగా ప్రయోజనకారిగా లేదన్న విమర్శలు వచ్చాయి.

# అమెరికాతో ఒప్పందంపై తొందరలేదు

## ఈయూతో ఒప్పందంతో దేశానికి మేలు

### అమలయ్యే తేదీని త్వరలో ప్రకటిస్తాం : వాణిజ్య మంత్రి పియూష్



**న్యూఢిల్లీ, జనవరి 31:** ఇటీవల భారత్ యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పరిణామం తర్వాత అమెరికాతో కూడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్ కుదుర్చుకుంటుందా? అనే ప్రశ్నకు భారత వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ లేదని జవాబిచ్చారు. ఆయన ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. రష్యాతో చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా 50 శాతం పన్నుల్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అమెరికా బెదిరింపులకు లొంగి.. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి భారత్ లొంగిపోయిందనే వార్తలొచ్చాయి. అయితే.. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ముగింపు దిశగా సాగుతుందని పీయుష్ గోయల్ తాజాగా అన్నారు. ఇయుతో భారత్ కుదుర్చుకున్నది మంచి ఒప్పందం. ఈ ఒప్పందం విషయంలో మేము చాలా చురుగ్గా పాల్గొన్నాము. ఈ ఒప్పందం విషయంలో ఇరుపక్షాలు సంతృప్తి చెందాయి. ఈ ఒప్పందం ఎప్పుడు అమల్లోకి వస్తుందో తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన ఈ ఇంటర్వ్యూలో చెప్పారు.ఖాగా, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం చేసుకుంటుందా? అని ప్రశ్నించగా.. అమెరికాతో ఒప్పందం విషయంలో కానీ.. ఆ దేశంతో పరిష్కరించుకోవాల్సిన సమస్యలు కానీ ఏమీ లేవని నేనకుటున్నాను. కానీ ప్రస్తుతం మేము అమెరికాతో ఒప్పందం చేసుకోకూడదని అనుకుంటున్నాము. ఆ దేశంతో ఒప్పందం ముగించాలనే ఆలోచిస్తున్నాము అని గోయల్ అన్నారు. ÷నడా ప్రధాని మార్క్ కార్నీ ఈ ఏడాది మార్చిలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కెనడాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశముందని గోయల్ తెలిపారు.



# డిపాజిట్లను, ఈక్విటీలను ఒకే రకంగా చూడాలి

### పన్నుల సమానత్వం పాటిస్తే మంచిది: ఎస్‌బీఐ చీఫ్

**ముంబయి, జనవరి 31:** బ్యాంకు డిపాజిట్లు, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ల నుంచి వచ్చే రిటర్నులపై పన్ను విషయంలో సమానత్వం ఉండాలని ఎస్‌బిఐ ఛైర్మన్ కోరారు. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. మంబయిలో జరిగిన ఓ బ్యాంక్ ఈవెంట్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌కు ముందు ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పొదుపు సాధనాల విషయంలో ప్రపంచంలో ఎక్కడా అసమానతలు లేవని, భారత్‌లోనూ ఇదే విధానం ఉండాలన్నారు. ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను శ్లాబు ప్రకారం 30 శాతం వరకు పన్ను పడుతోంది. అదే లిస్టెడ్ ఈక్విటీలపై లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ కింద రూ.1.25 లక్షలు దాటాక 12.5 శాతం, షార్ట్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై 15-20 శాతం మాత్రమే పన్ను పడుతోంది. ఈ కారణంగానే మదుపుదారులు ఎక్కువ రిటర్నుల కోసం ఈక్విటీ మార్కెట్లవైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గుముఖం పడుతున్నాయని, రుణాల జారీకి నిధుల కొరత ఏర్పడుతోందని బ్యాంకర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈక్విటీ, బ్యాంకు డిపాజిట్లను ఒకే విధంగా పరిగణించాలని శ్రీనివాసులు శెట్టి కోరారు. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్లకు గతంలో ఇచ్చిన పన్ను ప్రోత్సాహకాలు అప్పటి పరిస్థితులకు సరైనవే.. కావొచ్చని, ఇప్పుడు ఈక్విటీ మార్కెట్లపై ఆసక్తి పెరిగిన నేపథ్యంలో ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

# బడ్జెట్ ఆమోదంలో కాంగ్రెస్ విఫలం

### మరోమారు అమెరికాకు తప్పని షట్‌డౌన్

**వాషింగ్టన్, జనవరి 31:** అమెరికా ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచి పోనున్నట్లు అంతర్జాతీ య మీడియా శనివారం వెల్లడించింది. అమెరికాలో డొ నాల్డ్ ట్రంప్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపా దనలను ఆమోదించడంలో కాంగ్రెస్ విఫలం కావడంతో ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ లోకి వెళ్లిపోయింది. 2026 సంవ త్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను ఆమోదిం చడానికి అర్ధరాత్రి వరకూ గడువు ఉన్నా.. ఆ లోపు దాన్ని కాంగ్రెస్ ఆమోదించలేకపోయింది. ఈ నేపథ్యంలో నిర్ణీత గడువును కాంగ్రెస్ దాటవేయడంతో ప్రభుత్వం శనివారం పాక్షికంగా షట్ డౌన్ అయింది. దీంతో పలు సేవలు నిలిచిపోబోతున్నాయి. షట్‌డౌన్ స్వల్పకాలికంగా ఉ ండవచ్చని సెనేటర్లు చెబుతున్నారు. మరోవైపు గడువుకు ముందు బడ్జెట్ పై ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో, తాత్కాలిక లేదా పూర్తి-సంవత్సర నిధుల చర్యను కాంగ్రెస్ ఆమోదించే వరకు కీలకం కాని పలు ప్రభుత్వ కార్యకలాపాల్ని నిలిపేస్తున్నారు. సభ తిరిగి సమావేశం అయ్యాక సెనేట్ మద్దతు ఉన్న ఒప్పందాన్ని ఆమోదించడానికి తగినంత మద్దతును కూడగట్టడానికి చట్టసభ సభ్యులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తాజా



పరిణామాల నేపథ్యంలో ?. అమెరికాలో దాదాపు మూడో వంతు ప్రభుత్వ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, రక్షణను నిర్వహించే అనేక ఏజెన్సీలలో షట్‌డౌన్ చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విభాగాలు రాత్రికి రాత్రే షట్‌డౌన్ ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభించాలని భావించాయి. కానీ ఇది తాత్కాలికమేనన్న అంచనాలతో ఆ ప్రతిపాదన విరమించుకున్నాయి. వచ్చే వారం ప్రారంభంలో కాంగ్రెస్ ఊహించిన విధంగా ప్యాకేజీని ఆమోదిస్తే, కొన్ని రోజుల్లో నిధుల పునరుద్ధరణ ఉంటుందని అంచనా వేస్తున్నారు. షట్‌డౌన్ కొనసాగితే మాత్రం పదివేల మంది ప్రభుత్వ కార్మికులు జీతం లేని సెలవును ఎదుర్కోవలసి రావచ్చు, లేదా నిధులు అందేవరకు జీతం లేకుండా పని చేయాల్సి రావచ్చు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్–సీపీఐ పొత్తు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఐ కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, గత పాలనలో జరిగిన అభివృద్ధి పనులను ఎండగట్టడం ఈ పొత్తు ప్రధాన ఉద్దేశ్యమని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న బాల్క సుమన్ వెంటే ఉంటామని సీపీఐ నేతలు స్పష్టం చేయడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారిందని తెలిపారు.



### కాంగ్రెస్ వైఫల్యాలే అస్త్రాలు

అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని బీఆర్ఎస్ విమర్శించింది. ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, అభివృద్ధి పనుల నిర్లక్ష్యం కారణంగా మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీకి పరాజయం తప్పదని పేర్కొంది. కాంగ్రెస్ అరాచక పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో సీపీఐ కలవడం శుభపరిణామమని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయని వెల్లడించారు.

### అభివృద్ధికే ప్రజల మద్దతు

ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న బాల్క సుమన్ నాయకత్వంపై నమ్మకంతోనే సీపీఐ పొత్తుకు ముందుకొచ్చిందని నాయకులు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులే బీఆర్ఎస్ అభ్యర్థులకు బలమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. యువ నాయకత్వం, ఉద్యమ నేపథ్యం ఉన్న సుమన్ వ్యూహాలతో మున్సిపల్ ఎన్నికల్లో సంపూర్ణ విజయాన్ని సాధిస్తామని తెలిపారు.

### శ్రేణులకు సుమన్ పిలుపు

చెన్నూరు పురోగతే పరమావధిగా కార్యకర్తలు పనిచేయాలని బాల్క సుమన్ పిలుపునిచ్చారు. సీపీఐ మిత్రపక్షంతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను వివరించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తును గెలిపించడం ద్వారా నియోజకవర్గ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# వెటర్నరీ డాక్టర్ ను నియమించండి



**శెనార్తి మీడియా, బోథ్:**

బోథ్ ప్రభుత్వ పశు వైద్య ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని బోథ్ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పశు వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారని తెలిపారు. గత ఏడాది నుంచి ఆసుపత్రిలో అధికారి, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో మూగజీవులు మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల మరణాల వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు నిల్వలో లేకపోవడంతో బయట నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని వివరించారు. అధికారి తరచూ సెలవులో ఉండటంతో పేరుకే పశు వైద్య ఆసుపత్రి ఉందని వాపోయారు. ఇకనైనా ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో సిబ్బంది, అవసరమైన మందులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతులంతా కలిసి మూగజీవులతో ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

# సచివాలయంలో ఫైళ్ల జాప్యం.. గల్ఫ్ బాధితులకు అన్యాయం

## కలెక్టర్ పంపినా కదలని ఎన్నారై విభాగం అధికారులు

## నిధులు ఉన్నా విడుదల కాని వైనం.. ఎదురుచూపుల్లో 50 కుటుంబాలు

**గొల్లపెల్లి, జనవరి 31 :** జగిత్యాల జిల్లాకు చెందిన యాభై మంది గల్ఫ్ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్ గ్రేషియా అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ బాధితుల వివరాలు, ధ్రువీకరణ పత్రాలను సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపినప్పటికీ, రాష్ట్ర సచివాలయంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల బాధితులకు న్యాయం జరగడం లేదు.



### అధికారుల అలసత్వంతో ఆగిపోయిన సాయం

మొత్తం యాభై కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున రెండున్నర కోట్ల రూపాయలు మంజూరు కావాల్సి ఉంది. దీనికి సంబంధించిన నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ, సచివాలయంలోని జీఏడీ ఎన్నారై విభాగం అధికారుల అలసత్వం వల్ల డబ్బు ఇంకా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారు. జిల్లా నుంచి దరఖాస్తులు వెళ్లినా సచివాలయంలో ఫైళ్లు కదలకపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

అధికారుల తాత్సారం వల్ల అర్హులైన పేద కుటుంబాలకు అన్యాయం జరుగుతోంది. ఈ విషయంపై వెంటనే జిల్లా మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎంపీలు జోక్యం చేసుకోవాలని బాధితులు కోరుతున్నారు. సచివాలయ అధికారులతో మాట్లాడి వెంటనే నిధులు విడుదల చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాలకు చెందిన మృతుల కుటుంబాలు సాయం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నాయి.

## నియోజకవర్గాల వారీగా గల్ఫ్ మృతుల వివరాలు

### కోరుట్ల నియోజకవర్గం

మారంపెల్లి సుధీర్ (బహరేన్), వేంపేట, మెట్‌పల్లి
కునింటి శ్యాం అలియాస్ మంగిలిపెల్లి శ్యాంసుందర్ (షార్జా, యూఏఈ), వర్ష కొండ, ఇబ్రహీంపట్నం
అబ్దుల్ చాంద్ పాషా (సౌదీ), రవీంద్ర రోడ్, కోరుట్ల
వడ్ల అలియాస్ మానాల అశోక్ (షార్జా, యూఏఈ), మల్లాపూర్
కాపెల్లి రమేష్ (సౌదీ), రేగుంట, మెట్‌పల్లి
గాజర్ల శ్రీనివాస్ (దుబాయి, యూఏఈ), ఐలాపూర్, కోరుట్ల
పోగుల నరేష్ (బహరేన్), మల్లాపూర్
మహ్మద్ అబ్దుల్ జావీద్ (రియాద్, సౌదీ), బిలాల్ పుర, కోరుట్ల
సాదుల అశోక్ (రియాద్, సౌదీ), డబ్బ, ఇబ్రహీంపట్నం
కర్నె గణేష్ (రియాద్, సౌదీ), రేగుంట, మల్లాపూర్
ఖాజా మొహినుద్దీన్ (మదీనా, సౌదీ), గంగంపేట, కోరుట్ల
రెబ్బతి కొండయ్య (సౌదీ), చిట్టాపూర్, మల్లాపూర్
బొల్లోజి కిషన్ (ఓమాన్), రాతల్ పంపు, కోరుట్ల
మాటేరి కిషన్ (దుబాయి, యూఏఈ), రాజేశ్వర్ రావుపేట, మెట్‌పల్లి
షేఖ్ హైదర్ (అబుదాబి, యూఏఈ), వర్షాకొండ, ఇబ్రహీంపట్నం
మహ్మద్ వసీం (సౌదీ), గాజులపేట, మెట్‌పల్లి
లకావత్ రమేష్ (షార్జా, యూఏఈ), వాల్గొండ, మల్లాపూర్
బత్తిని రమేష్ (బహరేన్), యూసుఫ్ నగర్, కోరుట్ల
షేఖ్ అహ్మద్ (సౌదీ), నయీమ్ నగర్, కోరుట్ల

### ధర్మపురి నియోజకవర్గం

మిట్ట రాజయ్య (షార్జా, యూఏఈ), గంగాపూర్, బుగ్గారం
సల్లూరి రాజేశం (బహరేన్), తీగల ధర్మారం, ధర్మపురి
కటుకం సిద్ధార్థ (దుబాయి, యూఏఈ), ధర్మపురి
కొప్పుల సంజీవ్ (దుబాయి, యూఏఈ), వెనుగుమట్ల, గొల్లపల్లి
స్వర్గం శ్రీనివాస్ (దుబాయి, యూఏఈ), దమ్మన్నపేట, ధర్మపురి
బూట్ల రాజేందర్ (సౌదీ), కొత్తపేట, ఎండపల్లి
సాంబారి స్వామి (దుబాయి, యూఏఈ), బొంకూర్, గొల్లపల్లి
కలమడుగు కొమురయ్య (సౌదీ), చిన్నాపూర్, ధర్మపురి
కొమురెల్లి నరేష్ (సౌదీ), బోయవాడ, ధర్మపురి
ఎనుగందుల కిష్టయ్య (ఖతార్), కొండాపూర్, ఎండపల్లి
ఎర్రం రాజ్ కుమార్ (దుబాయి, యూఏఈ), బూరుగుపల్లి, ధర్మపురి
బేతు ప్రసాద్ (మస్కట్, ఓమాన్), దొంతాపూర్, ధర్మపురి
లింగంపెల్లి రమేష్ (ఇరాక్), పెగడాపల్లి
గుర్రం సురేష్ (ఇరాక్), నేరెళ్ల, ధర్మపురి

### జగిత్యాల నియోజకవర్గం

నీలి తిరుపతి (దుబాయి, యూఏఈ), శంఖులపల్లి, జగిత్యాల
మహ్మద్ ముఖ్తార్ మొహియుద్దీన్ (దుబాయి, యూఏఈ), సుతారిపేట, జగిత్యాల
దాసరి రమేష్ (దుబాయి, యూఏఈ), అల్లీపూర్, రాయికల్
అనుమాండ్ల రాజేశం (దుబాయి, యూఏఈ), పెంబట్ల, సారంగాపూర్
బోగ మనోహర్ (జుబేల్, సౌదీ), క్రిష్ణానగర్, జగిత్యాల
సుతారి అలియాస్ తోట ధర్మయ్య (సౌదీ), రాయికల్
అనుమల్ల కళ్యాణ్ (సౌదీ), టాకా వీధి, జగిత్యాల

### వేములవాడ నియోజకవర్గం

చేర్ గంగారాం (షార్జా, యూఏఈ), దమ్మన్నపేట, మేడిపల్లి
గడ్డం నర్సారెడ్డి (సౌదీ), తొంబరావుపేట, మేడిపల్లి
గుంట హనుమంతు (సౌదీ), పోసానిపేట, కథలాపూర్
సంగెం వినోద్ (సౌదీ), భూషణ్ రావు పేట, కథలాపూర్
సంగ మల్లయ్య (సౌదీ), తక్కళ్లపల్లి, కథలాపూర్
చెక్కపెల్లి గంగాధర్ (దుబాయి, యూఏఈ), భీమారం

### చొప్పదండి నియోజకవర్గం

ఆకునూరి నర్సయ్య (ఓమాన్), నాచుపల్లి, కొడిమ్యాల
పంజాల వాసు గౌడ్ అలియాస్ శ్రీనివాస్ (దుబాయి, యూఏఈ), ముత్యంపేట, మల్యాల
బోగ గంగసాయి (దుబాయి, యూఏఈ), మల్యాల
బూస అంజయ్య (యూఏఈ), ముత్యంపేట, మల్యాల

# మున్సిపల్ ఎన్నికలు మా పాలనకు రిఫరెండం

## వీటిని సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాం: మంత్రి పొంగులేటి

## తొర్రూరు మున్సిపాలిటీని దత్తత తీసుకుంటా

## దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం

## ఖమ్మం, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో సుడిగాలి పర్యటన



**హైదరాబాద్/పాలేరు, జనవరి 31:** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పురపాలక ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం సెమీ ఫైనల్స్‌గా భావిస్తోందని, ఈ ఎన్నికల్లో తమకు సరైన పోటీయే లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల నేపథ్యంలో శనివారం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం నుంచి ప్రారంభించి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వర్ధన్నపేట, జనగామ మున్సిపాలిటీల్లో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు. పదేళ్ల బీఆర్ఎస్ (దీ=వా) పాలనపై పొంగులేటి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారని, ఆనాటి పాలకులు తమ ఖాతాలు నింపుకోవాలని చూశారే తప్ప సామాన్యుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోందని, ఇది వారి అవినీతికి నిదర్శనమని ఆరోపించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు. గతంలో పంచాయతీరాజ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మంచి ఆధిక్యత వచ్చిందని, అదే ఫలితం ఇప్పుడు పురపాలికల్లో కూడా పునరావృతం కాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలతో కలిసి మెలిసి పనిచేసే వారికే టిక్కెట్లు ఇస్తున్నామని, తమతో కలిసి వచ్చే పార్టీలకు కాంగ్రెస్ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ నేతలు ప్రతి ఎన్నికను ప్రభుత్వ పనితీరుకు రిఫరెండం అని ప్రకటించి భంగపడ్డారని, ప్రతి ఎన్నికలోనూ ప్రజలు వారిని తిరస్కరించారని గుర్తు చేశారు. ఈసారి కూడా ఆ దొర వారు భంగపడితే ఏం చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సంస్కరణలు, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలంటే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని జోస్యం చెప్పారు. తొర్రూరు నా బాధ్యత ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి పొంగులేటి తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో పర్యటిస్తూ కీలక ప్రకటన చేశారు. తొర్రూరు మున్సిపాలిటీని తాను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న తాను, తన సొంత నియోజకవర్గంతో సమానంగా ఈ మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానన్నారు.

# ఖమ్మం సమగ్రాభివృద్ధే లక్ష్యం

## రూ.1.5 కోట్లతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

## అమృత్, యూజీడీ పథకాల కింద భారీగా నిధులు

## త్వరలో మెడికల్ కాలేజీ ప్రారంభం: మంత్రి తుమ్మల



**ఖమ్మం, జనవరి 31:** ఖమ్మం నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని 6, 7 డివిజన్లలో రూ. కోటి యాభై లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఖమ్మం నగర జనాభా ఐదు లక్షలకు చేరుకుని శరవేగంగా విస్తరిస్తోందని, దానికి అనుగుణంగా రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి ఆగకూడదన్న ఉద్దేశంతో నిధులు కేటాయిస్తున్నామన్నారు. రహదారులు, డ్రైనేజీ ప్రధాన సమస్యలుగా గుర్తించి అమృత్ పథకం కింద రూ. 200 కోట్లు, యూజీడీ కింద రూ. 250 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కొత్తగా విలీనమైన పంచాయతీల్లోనూ రహదారులు, డ్రైన్లు నిర్మించి ఇబ్బందులు తొలగిస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంలో విద్యా, వైద్య సౌకర్యాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే పేరున్న స్వామినారాయణ విశ్వవిద్యాలయం ఇక్కడ ఏర్పాటు చేశామని, త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మెడికల్ కాలేజీని ప్రారంభించబోతున్నామని తెలిపారు. అలాగే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరుగుతోందన్నారు. ఇక్కడ విద్యా, వైద్య ప్రమాణాలు మెరుగ్గా ఉండటంతో ఆంధ్ర ప్రాంతం నుంచి కూడా ప్రజలు వచ్చి ఇక్కడ స్థిరపడుతున్నారని చెప్పారు. చేపట్టిన అభివృద్ధి పనులు పది కాలాల పాటు నిలిచి ఉండేలా నాణ్యతతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా, చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. రోడ్ల విస్తరణతోనే అభివృద్ధి సాధ్యమని, గోశాల రోడ్డును వెడల్పు చేస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఖమ్మాన్ని శుభ్రమైన, అన్ని సౌకర్యాలున్న నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.